# అందుకే ఆయనంటే గౌరవం

"హలో, వెంకీ ! హౌడూయుడు.?!"

"బాగానే ఉన్నాను. నువ్వెట్లున్నావ్?"

"మంచిగనే ఉంటి. ఏందట్ల చిక్కిపోయినవు! మంచిగ తిని తాగు, పైసలకెనుకాడకు."

"నా సంగతికేంలే. నువ్వు మాత్రం మంచిగనే లాగిస్తున్నట్లున్నవ్"

"మరి నా కొడుకూ, కూతురూ అమెరికాలోనే సెటిలయ్యిన్రు. మనకంతా పుర్సతే... పనిమీద ఎళుతున్నట్లున్నావ్. మళ్ళొకసారి కలుస్తా."

అతనెళ్ళిపోయాక నేనడిగాను వెంకట్రావును. "బాగా పరిచయమయిన మనిషిలా ఉన్నాడే మీకు! మీ రైల్వేలోనే పనిచేసి రిటైరయ్యాడా?" అని.

"అవును రైల్వేలోనే రిటైరయ్యాడు. పాయింట్స్‌మన్‌గా చేరి ఎక్స్‌ప్రెస్‌గార్డుగా రిటైరయ్యాడు. అతడి పేరు సాంబయ్య" అంటూ అతని కథ చెప్పసాగాడు వెంకట్రావు.

***

సాంబయ్యది మా వూరే. ఊరు శివారు మాదిగపల్లెలో ఉండేవాడు. స్వాతంత్ర్యానంతరం వచ్చిన సర్వసమభావన పవనాల్లో అతనూ కొట్టుకెళ్ళి స్కూల్లో చేరాడు. ఆరోక్లాస్ చదివాడేమో. నాకు గుర్తులేదు. ఆ తర్వాత మానేశాడు. తండ్రికి పనిలో సాయపడేవాడు. అప్పటికి బాలకార్మిక వ్యవస్థపట్ల పల్లెల్లో వ్యతిరేకత లేదు. స్కాలర్‌షిప్‌లు, హాస్టల్‌వసతి కల్పిస్తే దళితులు పైకి వస్తారనుకుంటాం. నిజానికి అందువల్ల మాత్రమే అణగారిన జాతి పైకిరాదు. మనిషి జీవితంలో కుటుంబ వాతావరణానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. మనిషి ఒక్కడే పుట్టడు. ఒక వాతావరణంలో పుడ్తాడు. ఆ వాతావరణం అతన్ని మలుస్తుంది. సాంబయ్య ఇంట్లో ఆ వాతావరణం ఉండే అవకాశం లేదు. తండ్రి వెట్టివాడు. పటేల్, పట్వారీలకు అణకువగా మెలగాల్సినవాడు. రెండెకరాల ఈనాముభూమి ఉంది. దాని సేద్యానికీ ఊరి పెత్తందార్ల మీద ఆధారపడాల్సిన బతుకు!

నేను రైల్వేలో చేరి రెండుమూడేళ్ళయిందేమో! అసిస్టెంటుస్టేషన్ మాస్టరుద్యోగం. సికిందరాబాద్ – వాడి లైనులోనున్న గోధుమ్‌గూడలో పనిచేసేవాడిని. ఓసారి సెలవుమీద ఊరికెళ్లినపుడు సాంబయ్య తండ్రి యాదయ్య తనకొడుక్కేదైనా ఉద్యోగం ఇప్పించమని ప్రాధేయపడ్డాడు. సరే, చూద్దామని అప్పటికన్నాను గానీ, నాకేం నమ్మకంలేదు. నాపలుకు బడెంత, నేనెంత? నేను చెబితే ఎవడు పనిలో పెట్టుకుంటాడు? నిజానికి అప్పటి కింకా అస్పృశ్యతా కళంకకుడ్యాలు బీటలు వారాయి గానీ విచ్చుకోలేదు. ఏ పెద్దింటి వ్యక్తీ పనిలో పెట్టుకోవాలన్నా ఆలోచించే పరిస్థితి. అప్పటికా విషయం మర్చిపోయాను

ఓ రెండునెలల తర్వాత పనిమీద సికిందరాబాదు రైల్వే ఆఫీసుకెళ్ళాను. అక్కడ మా మావయ్య కలిశాడు. నన్ను చూసి సంబరపడిపోయాడు. నాగపూర్‌నుండి ఆయనకు సికిందరాబాదు బదిలీ అయింది. పర్సనల్ ఆఫీసులో మీనియల్ పోస్టుల నియామకం చేస్తుంటాడు. సర్వీస్ కమిషన్ పరీక్షల్లో నెగ్గుకురాలేనివారికి ఆ పోస్టులు దొడ్డిదారి. ముందుగా కళాసీగానో, గాంగ్‌మాన్‌గానో చేరినా, శక్తి ఉంటే పైకెదగవచ్చు. సాంబయ్యకు ఏ కళాసీ ఉద్యోగమో ఇప్పించమని మావయ్యనడిగాను. ఆయనకు యాదయ్య తెల్సు. సరే అప్లైచేయించు చూస్తానన్నాడు. నేనే అప్లికేషన్ రాసి, సాంబయ్య చేత సంతకం చేయించి మావయ్యకు పంపించమని మా నాయనకు ఉత్తరం రాశాను. ఆ తర్వాతేం జరిగిందో నాకు తెలియదు.

నెలరోజుల తర్వాత సాంబయ్య గోధుమ్‌గూడ స్టేషన్‌లో దిగేసరికి నేను ఆశ్చర్య పోయాను.

"మావయ్యగారే, నన్నిక్కడ పాయింట్స్‌మన్‌గా పోస్ట్ చేసిండు దొరా! కొత్త గనుక మనోడి దగ్గరుంటే నువ్వు పైకొస్తావని, నన్నీడకు పంపిండు. అంతా తమరి దయ. బాన్చను" అన్నాడు సాంబయ్య.

"నువ్వు జీవితంలో పైకి రావాలంటే ముందీ 'బాన్చను' అన్నమాట వదిలెయ్యి, నన్ను 'దొరా' అని పిలవాల్సిన పనిలేదు. అందర్లాగే 'సార'ని పిలువు. లేదా మనూరిలో పిల్చినట్టు ఎంకయ్య అని పిలువ్" అని అతనికి మొదటిపాఠం చెప్పాను.

అతనలాగేనని తలూపాడు. చురుకైనవాడు సాంబయ్య. పాయింట్స్‌మన్‌గా స్టేషన్లో అతని డ్యూటీ ఏమిటో చెప్పాను. ఆ చిన్న స్టేషన్లో పెద్దపనులేం ఉండవు. బండివచ్చినపుడు డ్రైవరుకు లైన్‌క్లియర్ సిగ్నలివ్వడం, స్టేషన్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచడం, మాకు చాయ్, టిఫిన్లు తీసుకు రావటం లాంటి పనులే. స్టేషన్లోగానీ, ఆ చుట్టుపక్కలగానీ హోటళ్లూ,

చాయ్ దుకాణాలూ ఉండేవికావు. మా క్వార్టర్లకు వెళ్ళి ఆడాళ్ళు చాయ్ చేస్తే పట్టుకురావడం లాంటి చిన్నపన్లు.

ఇతను మెల్లగా పని నేర్చుకున్నాడు. ఎందులోనైనా భరోసా పెట్టగలిగే స్థాయికి ఎదిగాడు. నిశ్చింతగా అతని పై నమ్మకముంచవచ్చు. మా ఆడాళ్ళు పుట్టింటికెళ్తే నాకు వంట చేసి పెట్టేవాడు. ఊర్లో అస్పృశ్యత వున్నా, నేనది పాటించేవాణ్ణికాదు. మా ఆవిడుంటే అతన్ని క్వార్టర్ లోనికి రానిచ్చేదికాదు. ఎవరిపైనా నా అభిప్రాయాలు రుద్దడం నాకిష్టం లేదు.

నాలుగేళ్ళలో సాంబయ్య బ్రేక్స్‌మన్‌గా సెలక్టయ్యాడు. సికిందరాబాద్‌లో పోస్ట్ చేశారు. ఆరోజు సాయంత్రం సికిందరాబాద్ వెళ్ళాల్సి ఉండగా పొద్దునొచ్చి, "సారూ! మరేమను కోనంటే ఓ మాట, ఈడకు రెండు ఫర్లాంగుల దూరంలో లంబాడా తండా ఉండాది. అక్కడో మంచి పోరి ఉన్నాది. కిన్కా అంటే నాకిష్టం. దానికీ నేనంటే ఇష్టమే. మనువాడ దామనుకుంటున్నా" అన్నాడు.

"మరి మీ నాయనకు చెప్పినావా?" అనడిగినా.

"చెప్పినా. 'కులంలో కోతయినా మంచిది, మనకంటే తక్కువోళ్ళ పిల్లను చేసుకుంటే కష్టపడతావురా. నీ మామ కూతుర్నిస్తనంటున్నడు. దాన్ని చేసుకో' అన్నాడు. అదంటే నాకిష్టం లేదు. నల్లగా ఉంటాది. రాచ్చసి."

"మరి నువ్వు ప్రేమించినమ్మాయి తల్లిదండ్రులేమంటారో?"

"ఎరకయితే అగ్గిబుగ్గవుతరు. లేచిపోతుండాం ఇయాళే."

చెప్పినట్టే లేచిపోయారు వాళ్ళు. రెండ్రోజులుపోయాక కిన్కా తండ్రి జనాన్నేసుకుని స్టేషను మీదకొచ్చాడు దాడికి.

"సాంబయ్య ఇక్కడ పని చెయ్యడం లేదు. సికిందరాబాదు బదిలీ అయింది. అయినా ఎందుకయ్యా దిగులు పడుతున్నావ్! ఆడు మంచిగా కమాయిస్తుండె, పిల్లను మనువాడ బోతుండె" అన్నాన్నేను.

"ఆడు మా జాతోడు కాదు. మా పోరినెట్టా మనువాడతాడు?" అన్నాడు కిన్కా తండ్రి.

అది వ్యర్థమైన ఆగ్రహం. అతనికి సికిందరాబాదెళ్ళి సాంబయ్యను వెతికి, కూతుర్ని తెచ్చుకునే సామర్థ్యం లేదు. తర్జనభర్జనలుపడి చచ్చిందని చెప్పి ఊరుకుండిపోయాడు.

సాంబయ్య బ్రేక్‌మాన్ అయ్యాక ఓసారి సికిందరాబాద్‌లో కలిశాను. అతనిలో ఇదివరకటి మోటుతనం పోయింది. పంచె మానేసి పాంటూషర్టు వేస్తున్నాడు.

"ఎంకయ్యా! మా ఇంటికిరా" అని ఆహ్వానించాడు.

"ఇప్పుడుకాదు, ఈసారొచ్చినప్పుడు వస్తా"నన్నాను.

ఐదారేళ్ళకుగానీ సాంబయ్యను కలవడం కుదరలేదు. గూడ్స్‌గార్డ్‌గా ప్రమోషన్ మీద కాజీపేట్‌లో పనిచేస్తున్నాడు. నేనింకా అసిస్టెంట్ స్టేషన్‌మాస్టరుగానే ఉన్నాను. నియామకంలోనూ, పదోన్నతిలోనూ రిజర్వేషన్ సౌకర్యం కల్పించడం అంబేద్కర్ దళితులకు పెట్టిన భిక్ష.

"పద మీ ఇంటికి వెళ్దాం" అన్నాను.

"ఇప్పుడు నేను కాజీపేటలో వుంటున్నాను వెంకట్రావుగారూ! ఊళ్ళో ఉన్నప్పుడేమో రమ్మంటే రాకపోతిరి!" అన్నాడు.

భాష మారింది, పిలుపూ మారిందనుకుని "పోన్లే ఈసారి ఎప్పుడయినా వస్తాను" అన్నాను.

నన్ను హోటలుకు తీసికెళ్ళి కాఫీ టిఫిన్లు ఇప్పించాడు.

ఇప్పటికి వాళ్ళ నాయనకు కోపం దగ్గిందట. కిన్కొ చిదిమి దీపం పెట్టేట్లు వుంటుందని సంతోషించాడట. తనకో కొడుకు, కూతురు కలిగారని చెప్పగా "ఇంతకీ ఆ పిల్లను మనువాడావా?" అనడిగాను.

"పెళ్ళా! అట్టాంటిదేంలేదు. మొగుడూ పెళ్ళాలుగానే బతుకుతున్నాం. రైల్వే రికార్డుల్లో అదే నా పెళ్ళామని నమోదైంది" అన్నాడు.

జీవితం విచిత్రమయింది. ఎన్నో మలుపులు. సాంబయ్య తండ్రి చనిపోయాడు. ఊళ్ళో ఉన్న ఈనాము భూమికోసం తమ్ముడితో తగాదా పడ్డాడు. అది పండే పొలం కాదు. కానీ భూమికైపోరాటం అంతమయ్యేదికాదు. తమ్ముడిది వెట్టి జీవితమే. మండల్ వ్యవస్థ వచ్చి పటేల్, పట్వారీగిరీలు పోయినా కిందిస్థాయి గ్రామోద్యోగులను తీసేయలేదు ప్రభుత్వం. తమ్ముడితో కలహించి కోర్టెక్కాడు సాంబయ్య. తమ్ముడికి కోర్టులో కేసు నడిపే తాహతులేదు. కేసు రెండేళ్ళు కోర్టులో నడిచాక అన్నతో రాజీకొచ్చాడు. తన వాటాకి వచ్చిన ఎకరాన్ని అమ్మేసి డబ్బు చేసుకున్నాడు సాంబయ్య.

"తోడబుట్టినోడేకదా, లేనోడు. అతనికా ఎకరం వదిలేస్తే నీకేం నష్టం?" అనడిగాను.

"నీకేంది ఎంకట్రావూ! నువ్వట్టనే జెప్తవు. నా పిల్లలూ పైకెదిగొస్తుండిరి. ఆళ్ళకు చదువుల్చెప్పించొద్దా? నాలాగా ఆళ్ళూ బతకటం మంచిపని కాదుగందా?"

అందుకు నేనేం సమాధానం చెప్పగల్ను? ఎవరికి వాళ్ళే ఆలోచించుకోవాలి.

సాంబయ్య పాసింజరు గార్డయ్యాడు. అతనికి ఇంగ్లీషు రాదు. ఏ రిపోర్టు పంపించాల్సినా స్టేషనుమాస్టర్లను అర్థించి రాయించుకునేవాడు. బతుకు తెరువు తెల్సినవాడు. పిల్లల్ని రైల్వే స్కూల్లో చదివించాడు. డబ్బుతో నాగరికత అబ్బుతుంది.

నాకూ ప్రమోషన్ మీద హైదరాబాద్ బదిలీ అయింది. నన్ను బలవంత పెట్టి వాళ్ళింటికి తీసికెళ్ళాడు.

ఎప్పుడో గోధుమ్‌గూడ స్టేషన్లో రైలెక్కుతున్నప్పుడు చూశాను. కిన్కా ఇప్పుడు లంబాడీ స్త్రీ కాదు. మంచి పసిమి, చక్కటి రూపురేఖలు. సాంబయ్య అదృష్టం-కాకి ముక్కుకు దొండపండులా ఆమె దొరకడం. నన్నారోజు వాళ్ళింట్లో భోజనం చేస్తే కానీ వదల్లేదు వాళ్ళు.

ఇంకా పదేళ్ళ సర్వీసుందనంగా సాంబయ్య ఎక్స్‌ప్రెస్‌గార్డయ్యాడు. కొడుకు ఇంజనీరు, కూతురు డాక్టరు. పిల్లల తెలివికి రిజర్వేషన్ సౌకర్యం జతకలిసి వాళ్ళకా అవకాశం కల్గింది. ఎక్స్‌ప్రెస్ గార్డయ్యాక ఓసారి కన్పించాడు. పిల్లలు అమెరికాలో సెటిలయ్యార్ట. డబ్బు కూడా పంపిస్తున్నారట. కూతురికి సంబంధాలు చూస్తున్నామని గర్వంగా చెప్పాడు. నాకూ సంతోషమేసింది.

తమ్ముడి ఆగడం పెరిగిపోయిందట. ఎప్పుడూ డబ్బు కావాలని వస్తాట్ట.

"వెధవకు ఇద్దరు పిల్లలు. కూలీకి పంపిస్తున్నాడు. చదువు లేకపోతే పైకి రారని చెప్పిన. ఎంత చెప్పినా వినుకోడు. నేనేదో డబ్బుమూట కట్టుకున్నానని 'వెయ్యివ్వు, రెండు వేలివ్వు' అని వేధింపు. మొన్నొస్తే ఆడి ముఖాన రెండువేలు పారేసి 'ఇంక నాకొంప కొచ్చావంటే ఛంపేస్తా... నిన్ను తమ్ముడనుకోటం నాకు నామోషీ' అని తిట్టి పంపేశా. ఏం చేయను, నా దగ్గర ధనరాశులున్నయ్యా?"అన్నాడు సాంబయ్య.

ఆ మధ్య మాదిగ రిజర్వేషను పోరాట సమితిలో ప్రముఖ సభ్యుడయాడు. దళితుల్లో ఎ.బి.సి.డి. వర్గీకరణ జరిగితే తప్ప అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం జరగదన్నాడు.

"ఉన్న అవకాశాలన్నీ మాలోళ్ళే తన్నుకుపోతున్నారు. ఇది అన్యాయం అంటావా కాదా... నువ్వే చెప్పు, వెంకూ!" అన్నాడు.

నేను చెప్పగలిగిందేంలేదు. వర్గపోరాటం.... ఉన్నది పోగొట్టుకోవటం ఉన్నవాడికి ఇష్టం వుండదు. కింది వర్గంవాడు పైవర్గానికి చేరాలని ప్రయత్నింస్తుంటాడు. సహజ పరిణామాలకు నేనేం తీర్పివ్వగలను?!

చివరికి సాంబయ్య సూపర్ ఎక్స్‌ప్రెస్ గార్డ్‌గా చేసి రిటైరయ్యాడు. అతడికి ఆరు ప్రమోషన్లు వచ్చాయి. నాకు మూడు రావడం కష్టమైంది...

***

అలా సాంబయ్య కథ వినిపించాడు వెంకట్రావు నాకు.

"'నీ బాన్చను' స్థాయినుండి 'వెంకూ' అనే స్థాయిదాకా ఎదిగాడు సాంబయ్య. ప్రమోషన్లలోనూ నువ్వు వివక్షతకు గురయ్యావు. నీకేం కష్టమన్పించలేదా?" అనడిగాను వెంకట్రావును.

"కష్ట మెందుకు? 'ఒరే, వెంకూ' అని పిలవటంలేదు అతను. అక్కడికి సంతోషించాలి. సమాజం శతాబ్దాల తరబడి వాళ్ళని అణిచేసింది. వాళ్ళిప్పుడు తమ హక్కులు పొంది పైకి ఎదిగుతున్నారు. నిజానికి మనుషులు మేలు చేసినవాణ్ణి సహించలేరు. ఆ వ్యక్తిని కలుసుకోకుండా ఉండే ప్రయత్నం చేస్తారు. లేదా కీడు కూడా తలపెడ్తారు. సాంబయ్యలో ఆ గుణం లేదు. నేను ఉన్నతకులానికి చెందిన వ్యక్తినని నన్ను ద్వేషించడు. మనం చేసిన పాపం కొంత కడిగేసుకుంటున్నామన్న భావన నాలోనూ వుంది. కొంతమేరకు సామాజిక న్యాయం జరిగినందుకు ఆనందంగా వుంది. అయితే, వచ్చిన చిక్కల్లా పైకి ఎదిగినవాడు, తన కిందివాడికి ఎదిగే అవకాశం ఇవ్వటం లేదు. తను ఎదిగాక తనకు లభించిన సౌకర్యాలను వదులుకునే స్థితిలో లేడు. గాంధీ, అంబేద్కర్ లాంటి వారి కృషి చివరిస్థాయి వరకు చేరుకోవడం లేదు. ఇదే నాకు విషాదం కలిగించే విషయం" అన్నాడు వెంకట్రావు.

'ఇలా ఎంతమంది ఆలోచించగలరు?! సమకాలీన నిజవర్గభావజాల నియంతృత్వాన్ని తోసిరాజని భావించడం, అనుభూతి చెందటం అందరికీ సాధ్యమయ్యేది కాదు' అన్పించింది. అందుకే నాకు వెంకట్రావంటే నాకు గౌరవం.

(కథాసూత్రం అందించిన మిత్రులు కె. సత్యనారాయణరావు గారికి ధన్యవాదాలతో– రచయిత)

ప్రజాతంత్ర *(వార పత్రిక, నవంబర్ 19-25, 2006)*